# క్షితిజ రేఖలను దాటి

మా టూరిస్టు బస్సు అమరావతి చేరే సరికి సాయంత్రం ఐదు గంటలైంది. బస్సు దిగి మ్యూజియం గూర్చి విచారించే సరికి "అయ్యా! ఇది పల్లెటూరు. మీ కిక్కడ గైడ్సు వగైరాలు దొరకరు. నిజానికంత అవసరం కూడా లేదు. కాబట్టి ముందుగా మీరా బస్సుస్టాపు వెనుకగా ఓ ఫర్లాంగు వెళ్ళండి. అక్కడ బౌద్ధుల నాటి విహారమూ. శిధిలాలు కన్పడతాయి. దాని పక్కనే ఓ చిన్న మ్యూజియం. ఈ రెండూ చూడటానికి ఓ గంటకూడా పట్టదు. అ తర్వాత అమరేశ్వరస్వామి దర్శనం చేసుకొని ఇష్టమైతే కృష్ణలో స్నానంచేసి మరీ వెళ్ళవచ్చు,' అని ఓ పెద్దమనిషి సలహా చెప్పాడు.

"అయితే ఇంకేమైనా వున్నాయా చూడవలసినవి ?" ప్రశ్నించాను.

"ఇంతేనండీ - మరేంలేవు" జవాబిచ్చాడాయన.

'మాష్టారూ - జల్దీ పోదాం - మేము ఫోటోలు తీసుకునేందుకు లైటు చాలేట్టు లేదు. స్టూడెలట్సు తొందర చేస్తుంటే నేనుకూడా వారివెంట బయలు దేరుతూ 'చూడండి మీ పేరేమన్నారు ...' అని ప్రశ్నించాను.

'నా పేరు రంగారావండి - అ వఢ్నాలుగో మైలురాయి దగ్గర పొగతోట లేదూ - అది నాదే' వఢ్నాలుగోమైలురాయి అన్నది అమరావతి సమీపంలోని ఓ వూరు పేరుట.

"ఇదుగో చూడండి రంగారావుగారూ నా పేరు దీక్షితులు. వీళ్ళంతా మా స్టూడెంట్సు. మేము హైదరాబాదునుంచి స్టడీ టూరు మీద వెళ్తూ ఈ ఉదయమే గుంటూరు చేరాము. మధ్యాహ్నం లాంఫారం చూశాము- ఇప్పుడు అమరావతి చూసుకొని రాత్రికి విజయవాడకు చేరాలని మా సంకల్పం. మీకు వేరే అర్జంటు పని లేకపోతే మాతోకూడా ఓ గంటసేపు కనుక వుంటే సంతోషిస్తాము...."

రంగారావు వెంటనే అంగీకరించాడు.

పిల్లలంతా అప్పుడే హుషారుగా కేరింతలు పెడుతూ చాలా దూరం పోయారు- రంగారావు కేవలం పల్లెటూరి రైతేకాదు కొంచెం చదువూ సంస్కారమూ కలవాడు. "చిన్నప్పుడు తాడికొండ ఎస్ వి వి. హైస్కూలు లేదూ అక్కడ చదువుకున్నానండీ పోర్తుఫారం దాకా....

తర్వాత పెళ్లయి కుటుంబం నెత్తిన వడేసరికి పొగాకుచే పరిమితమై పోయాను". నవ్వుతూ చెప్పాడు రంగారావు - ఆయన కళ్లల్లోని వెలుగునుబట్టి హైదరాబాదు మహాపట్నం నుంచీ వచ్చిన వ్యక్తులవెంట తాను గైడు బాధ్యత నిర్వహించి రావడానికి చాలా సంతోషపడుతున్నట్లుగా గ్రహించగలిగాను- ప్రాచీన బౌద్ధవిహార శిథిలాలూ, పక్కనేవున్న మ్యూజియమూ ఓ అర్ధగంటలోనే చూపించేశాడు. నాకు మాత్రం అక్కడ అధ్యయనం చేయవలసిన విషయాలు చాలా వున్నట్లు అనిపించాయి కాని దానికిది తగిన సమయం కాకపోవడంవల్ల మనసు వెరుకను పీకుతున్నా కాళ్లు ముందుకు సాగిపోయాయి....

'ఇటు సార్ - ఇటు - ఇదిగో ఈ రథం పక్కగా రండి-ఇటు స్నానాల రేవు -' కృష్ణ వైపు నడిపించాడు రంగారావు. ఎండాకాలం కావడంవల్ల కృష్ణమ్మ అస్తినాస్తి విచికిత్సకు లోనై దర్శనమిచ్చింది - సూర్యుని అస్తమయ కిరణకాంతులు ఆమెను చెంగలువ మాలలలో పూజిస్తున్నట్లు కన్పడింది. అవతలి లంకలనుండి ఆవులూ, గేదెలూ మోకాలిలోతు నీళ్లలోనుండి నడుస్తూ అమరేశ్వరుని గుడివైపుకు వస్తున్నాయి. మా విద్యార్థులూ, నారోపాంట్లు ఒడ్డునవదేసి నీళ్లల్లోకి దిగారు.

'జాగ్రత్త' - హెచ్చరించాను వాళ్ళను నేను.

'ఫరవాలేదులెండి సార్ - ఇప్పుడేం ప్రమాదంలేదు - ఎంత లోతుకెళ్ళినా మోకాళ్ళు దాటవు నీళ్ళు - అ రామూగాడులేడూ. వాడు కృష్ణమ్మకు వరదలు వచ్చినప్పుడు కూడా అవలీలగా తెప్పకొయ్య లేకుండా అవతలి ఒడ్డుకు చేరుతాడు.' 'ఏ రామూగాడూ ?' ప్రశ్నించాను నేను.

'వాడే మా పిచ్చి వెధవ -' రంగారావు నవ్వుతూ జవాబు చెప్పాడు రామూనే తెలియకపోతే ఇంక మాదీ ఒక బతుకేనా అన్నట్లు - నేను మళ్ళీ ప్రశ్నించలేదు. కాని రంగారావే అన్నాడు 'అడుగో దూరాన ఆ లంకలో కూర్చొని వున్నాడు చూడండి వాడే మా రామూగాడు - 'నిశితంగా చూచాను. నిజమే దూరంగా ఓ చిన్నమనిషి కూర్చునివున్నట్లు కన్పడుతున్నది. "ఏం చేస్తున్నాడు ఆయనక్కడ ?" ప్రశ్నించాను. 'ఆయన కాదుసార్ - వాడు చిన్నపిల్లగాడు చదువుకోరా అని బడికి పంపితే పలకమీద పిలకపెట్టి అయ్యవారి బొమ్మ గీచాడు - బొమ్మైతే అచ్చంగా అయ్యవారిలానే వుంది గాని కోతి వనులు చేసి

సందుకు బళ్లోంచి తరిమివేశాడాయన. పోనీ వీణ్ని పొలం వనుల్లో పెట్టమని చెప్పాము. వాళ్లయ్యకి- 'సరేనని వాళ్లయ్య వీణ్ని పొలానికి కాపలా పంపించాడు. మనిషి మనిషిలాగే కూర్చొని వున్నాడు. కాడి, మోకులు మాత్రం దొంగలెత్తుకు పోయారు సార్...

'పాపం.... నిద్ర పోయాడేమో....' సానుభూతిగా చూశాను నేను.

'నిద్రలేదూ. పాడులేదు సార్ - వాడి రకమే అంత. వెర్రివెధవ - ఒక రోజు పొలానికి వాళ్లమ్మ పంపించిన బువ్వను దొర్లించి, కుక్క తినడం దూరం నుంచి చూశాను నేను. పరుగెత్తుకుంటూ వచ్చేసరికి నన్నుచూసి కుక్క పారి పోయింది. 'మొద్దెధవా కూడేదిరా-' అని నే నడిగితే రామూగాడు పక్కనేవున్న ఖాళీ గిన్నె చూసి. నవ్వి 'బహుశా ఇందాకా తినేసి వుంటాను బాబాయ్' అన్నాడు ఏం చెయ్యమంటారు వాణ్నింక... నవ్వుతున్నాడు రంగారావు.

నిజమే! వింతగా వుంది

ఉన్నట్టుండి నాకెందుకో అవతలి ఒడ్డును చేరాలనిపించింది.

"ఇప్పుడే వస్తాను" అని రంగారావుకు చెప్పి ఏకాంతంగా నీళ్ళనుండి నడుచుకుంటూ అవతలితీరం చేరి ఇసుకలో ముందుకు సాగాను.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఎటు చూచినా, చుట్టూ మానవులులేని నిర్జనప్రదేశం నిశ్శబ్ద సంగీతం.

సూర్యుని రథధాటికి పరాజితులైన పడమటి రాజుల అవమాన కళంకమా అన్నట్లు కారుచీకటి మరింత రాబోయే సూచనలు-

మరికొంచెం ముందుకు పోయాను. వాతావరణంలో పిల్లగాలులు నన్ను పులకరింపజేస్తున్నాయి - ఆ నిర్మల వాతావరణంలో పిల్లగాలుల ఆ సువిశాల నదీమతల్లి క్షీరమా అన్నట్లున్న కృష్ణమ్మ పులిన వేదికపై ప్రకృతిని కళ్ళతో తాగుతున్న రామూ-

దగ్గరికి పోయి చూచాను.

దరహసితవదనంతో గంభీరముద్రలో కూర్చొనివున్నాడు రామూ-

అతన్ని చూడగానే నాకెందుకో తొలిచూపులోనే అనిపించింది - ఇతడు పిచ్చివాడు కాడు - యోగి అని.

నేను సమీపానికి వచ్చానన్న పరిజ్ఞానం కూడా లేకుండా అలాగే ప్రకృతిలో ప్రకృతిగా మారి కూర్చొని వున్నాడు రాము.

చుట్టూ పరిశీలించి చూచాను.

అతని పక్కనే ఓ గీయబడ్డ చిత్రం వుంది.

ఆసక్తితో చేతిలోకి తీసుకొని చూచాను. ఆశ్చర్యపోయాను. బాగా చేయి తిరిగిన ఒక చిత్రకారుడు గీచిన బొమ్మలా వుందది.

'రాము .. రామూ ..' గట్టిగా పిలిచాను నా పిలుపు ఈసారి వినిపించి నట్లుంది. ఈ లోకంలోకి వచ్చి నన్ను చూచాడు. ఒక్క క్షణం బిత్తరపోయాడు ఈ కొత్తనారెవరా అన్నట్లు.

'బాబూ నీపేరేకదూ రామూ'

'అవునండి' కళ్ళల్లో కొంచెం భయం.

'నీ వయస్సెంత'

'తెలీదు'

సుమారు పదిహేను పదహారేళ్ళు దాటి వుండవనుకున్నాను.
'నీవేంచేస్తుంటావు?'

'ఏంచేయను - పగలుపూట బస్సుదగ్గర మూటలు మోస్తాను.'

'అదేంఖర్మ - హాయిగా పొలంపని చేయవచ్చుగా'

'నాకెందుకో ఏపనీ నచ్చదు - ఈ మూటలు మోసిన డబ్బులై నా రంగులు కొనుక్కోడానికే - ఆ డబ్బులు కండక్టరు మస్తానయ్యకిస్తే గుంటూరు నుంచి రంగులూ కాన్వాసూ, తెచ్చిపెడతాడు.'

రామూ వాడిన రంగులూ కాన్వాసూ చాలా చౌకబారువి. అయినాసరే చిత్రంలో అపూర్వమైన కళానైపుణ్యం వుంది. ఏ రవివర్మ చిత్రాన్నో చూస్తున్నట్లు నాకనిపించింది.

'ఈ బొమ్మ నీవే గీశావా?'

'అవునండీ - ఇవ్వాళే గీశాను.'

కృష్ణానదీ తీరం బాక్ గ్రౌండ్‌గా తీసుకున్నాడు. అక్కడ ఒక నర్తకి నర్తిస్తున్నది - నిజం చెప్పాలనివస్తే ఆమె నర్తకి కాదు. కృష్ణానదీ తీరంలో యుగయుగాలుగా ప్రవర్ధమానమైన శిల్ప కళాసుందరికి ఆమె సంకేతం. నేడు

పతనమైపోయిన వైభవాన్ని శిథిలప్రాయంగా మారిన ఆ సౌందర్యాన్ని సూచించే నిమిత్తం ఎరుపురంగు పరివేషంగా వాడాడు. అలంకార శాస్త్రంలో ఒక్కొక్క రసానికి ఒక్కొక్క రంగును నిర్ణయించారు శాస్త్రవేత్తలు. అవన్నీ ఈ పిల్లవాడికి తెలుసునా?

అసంభవం.

మరి ఇంత ధ్వన్యాత్మకంగా, ఈ చిత్రం ఎలా గీచాడు??

'ఈ బొమ్మకు మోడల్ ఏమయినా వుందా?.'

'లేదండీ - నాకెందుకో ఉన్నట్టుండి ఓ బొమ్మ గీయాలనిపిస్తుంది. గీస్తాను అంతే.'

'నీవింకా బొమ్మలు గీచావా?'

'ఆ గీచానండీ - కానీ మా అయ్య 'పొలంపని మాని పిచ్చెధవలా, తిరుగుతున్నావా కుంకా' అని తిట్టి వాటిని పొయిలో పారేశాడండీ....' రామూ కళ్ళమెంట నీళ్ళు వచ్చాయి.

నా హృదయం కలుక్కుమంది.

గుణాఢ్యుని హోమాలవంటివి నేటికీ సాగుతూనే వున్నాయన్నమాట!!

'చూడుబాబూ - నాపేరు దీక్షితులు - నేను హైదరాబాదులో వుంటాను ఈ బొమ్మను నావెంట తీసుకుపోతాను. అక్కడ లలితకళా ఎకాడమీవాళ్లకి చూపి నీకు గుర్తింపు వచ్చేటట్లు చేస్తాను అంతా నిన్ను పొగుడుతారు కూడా. ఏం, నాకిస్తావా మరి?'

రామూ ఓ క్షణం తెల్లబోయాడు.

కౌతుకమూ, సందేహమూ రంగరింపబడ్డ హృదయంనుండి పెల్లుబికిన రెండు మాడు మ్లానరేఖలు ముఖాన్ని ఆవరింపగా, ప్రశ్నించాడు.

"గుర్తింపూ పొగడ్తా ఎందుకు?"

ఇప్పుడు తెల్లబోవడం నావంతు.

'చూడు రామూ - నీవు మంచి కళాకారుడివి. నీ కళను నలుగురూ చూచి మెచ్చుకోవద్దా?'

'వద్దు - ఈ బొమ్మలు గీయకపోతే నేను బతుకలేనండీ - అందుకనే గీస్తున్నాను.' ఆవేశంగా అన్నాడు.

కీర్తిప్రతిష్టలు కావు రామూకు కావలసినవి, తన రచనా వ్యాసంగం సాగడమే లక్ష్యం, చిత్రరచన లేకపోతే అతడు జీవించలేడు - అందుకనే హృదయాన్ని చీల్చి బొమ్మలు బహిర్గమింపజేస్తున్నాడు.

'చూడు రామూ - ఈ బొమ్మ కూడా పొయ్యిలోకి పోక తప్పదు ఇక్కడుంటే - నన్ను నమ్మ నీకేమీ అన్యాయంచెయ్యను. నీ బొమ్మ సురక్షితంగా నాదగ్గర వుంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు పోస్టుద్వారా నీకు పంపుతాను సరేనా.'

రామూ కొంచెంసేపు ఆలోగించి 'సరే' నన్నాడు.

నేను జేబులోంచి వందరూపాయల నోటుతీసి ఇచ్చాను. రామూ ఆశ్చర్యపడ్డాడు. తీసుకోవడానికి మొగమాటపడ్డాడు.

'తీసుకో, రామూ ఏమైనా కొనుక్కో - నీకు కావలసిన మంచి రంగులూ కాన్వాసూ నేను పోస్టుద్వారా పంపుతాను. వీలైతే హైదరాబాదు లలితకళా ఎకాడమీద్వారా చిత్రవిద్య నేర్పించే స్కాలర్‌షిప్‌కై నీకోసం ప్రయత్నిస్తాను.'

రామూ కళ్లల్లోని కాంతిరేఖలను నేను తేలికగానే అక్షరాల కిందికి అనువదించుకోగలిగాను. అతడు ఉబ్బి తబ్బిబ్బవుతూ కళ్ళతోనే కృతజ్ఞతలు చెపుతున్నాడు - పసిహృదయం పరవశం చెందుతున్నది.

నిరంతరం తిరస్కారాలకూ, బహిష్కారాలకూ గురియైన రామూ మొట్టమొదటిసారి నానుండే ఓ దోసెడు సానుభూతికి నోచుకుంటున్నట్లున్నాడు చూడబోతే.

అందుకే వర్షాకాలంలోని కృష్ణమ్మలా ఉప్పొంగుతున్నాడు.

చీకటి వ్యాపిస్తున్నది, "వెళ్దామా ఇంక" అని లేచాను. నావెంట హుషారుగా లేచి నడవసాగాడు రామూ. నేను అడగకుండానె తనకు నచ్చిన తెలియవచ్చిన విశేషాలన్నీ గబగబ చెప్పేస్తున్నాడు. నేను నిశ్శబ్దంగా వింటున్నాను.

తాను పుట్టినదగ్గరనుండీ ఈ శిల్పాలమధ్యనే గోలీకాయలు ఆడుకుంటూ, గొడ్లు కాచుకుంటూ బతికేవాడట. చదువుకాని, పొలంపనులుకానీ అబ్బలేదట. ఎప్పుడూ కృష్ణలో దూకి అటూ ఇటూ ఈదాలనీ, పండే పంటపొలాలతో పాలపిట్టలా దూసుకుపోవాలనీ కృష్ణలంకలపై ఎవ్వరూ చుడకుండా గెంతుతూవుండాలని అనిపిస్తూ వుండేదట మనస్సుకు . ఈ ఆనందానుభూతికోసం తల్లిదండ్రులు

కొట్టినాసరే సహిస్తూనే వుండేవాడట. అప్పుడప్పుడూ అమరావతీ శిధిలాలమధ్య పడుకోని చేతితో వగిలిన బొమ్మలను నిమురుతూ అలాగే రాత్రీ పగలూ తేడా తెలియకుండా గడిపేవాడట....

కృష్ణను దాటి అవతలి ఒడ్డుకు చేరాము.

మా విద్యార్థులంతా అమరేశ్వరుని కోవెలలోకి వెళ్ళి గంటలు గణగణమని పిస్తున్నారు. నేనూ దైవదర్శనం చేసుకొని కొబ్బరిచిప్పను రామూకు ఇచ్చాను. వద్దనకుండా తీసుకొని అక్కడికక్కడే చిప్పమొత్తమూ తిన్నాడు.

రంగారావుకు కృతజ్ఞత చెప్పాను. అడ్రసు తీసుకున్నాను.

బాగా చీకటిపడింది.

మేమంతా తిరిగి టూరిస్టు వాన్ ఎక్కాము.

బస్సు దూసుకుంటూ గుంటూరు రోడ్డు పట్టింది. రామూ, రంగారావూ చీకట్లో కలిసిపోయారు క్రమంగా....

చిత్రాన్ని భద్రంగా నా బాగ్‌లో దాచాను బస్సులో. ఓ రెండుగంటల సేపట్లో అమరావతినుండి విజయవాడ చేరాము - అక్కడ భోంచేసి విశ్రమించి మర్నాడే తర్వాతి కార్యక్రమంలో సాగిపోయాము....

అలా ఓ పదిహేనురోజుల్లో టూరు మొత్తమూ ముగిసింది - ఈ ప్రయాణం దెబ్బతో ఒళ్ళంతా హూనమైపోయింది. తిరిగి హైదరాబాదు చేరాక రెండురోజుల వరకూ మంచం దిగలేకపోయాను. ఆ తర్వాత గుడ్డలు సర్దుకుంటే రామూ ఇచ్చిన శిల్పసుందరి బొమ్మ కన్పడింది. రామూగూర్చి ఈ రెండు వారాలలో పూర్తిగా మరిచేపోయాను నేను. దాన్ని ఫోటో తీయించి పత్రికలకు పంపాను. ఎకాడమీ కార్యదర్శిని కలుసుకొని బొమ్మను వారికిచ్చి "ఈసారి మీ ఆర్ట్ ఎగ్జిబిషన్"లో ప్రదర్శించ"మనికోరాను. రంగులూ, కాన్వాసూ చాలా ముతకగా వుండి రేఖలు అపరిమితంగా వున్నప్పటికీ వాటివెనుక వున్న అగాధమైన భావుకతకు మాత్రం కార్యదర్శిగారు కూడ ఆశ్చర్యపోయారు. "ఈ అబ్బాయికి సెంట్రల్‌దో, స్టేట్‌దో స్కాలర్‌షిప్ ఒకటి ఇప్పించే ఏర్పాటుచేస్తాను దీక్షితులు గారూ" అని నాకు మాట ఇచ్చారు. మరుగునపడ్డ మాణిక్యాన్ని వెలికితెచ్చిన గౌరవం నాకే దక్కింది కదా నేను కొంచెం గర్వపడ్డాను కూడాను,

అన్న మాట నిలబెట్టుకుని కార్యదర్శిగారు సెంట్రల్ స్కాలర్‌షిప్ ఒకటి ఇప్పించి ఎకాడమీ విజయవాడ కేంద్రంలో శిక్షణకొరకు చేరవచ్చునని తెలిపారు. ఈ సంతోష వార్తను నేను రంగారావుకూ, రామూ తల్లిదండ్రులకూ తెలిపాను. "ఈ సదవకాశాన్ని జారవిడుచుకోవద్దు మీ పిల్లవాడికి మంచి భవిష్యత్తు వుంది. గొప్ప చిత్రకారుడు కాగలడు. ప్రోత్సహించి పంపండి" అని రామూ తండ్రికి వ్రాశాను. ఓ వారంరోజుల్లో రామూ తండ్రి తనకు చదువురాదు కాబట్టి ఓ చదువుకున్న వ్యక్తిచేత జాబు వ్రాయిస్తూ అవ్యాజంగా నేను చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ పిచ్చివాడైన తమ కొడుకును మంచి మార్గంలో పెడుతున్నందుకు ధన్యవాదాలు తెలిపాడు. నేనూ సంతోషించాను.

ఇలా ఒక నెలరోజులు గడిచేసరికి ఓ విచిత్రం జరిగింది. నేను పంపిన రామూ శిల్పసుందరి ఫోటో ఓ స్థానిక పత్రిక ప్రచురించింది. కొద్దిరోజుల్లో ఆ చిత్రం చాలా బాగుందని జాబులు కూడా పత్రికల్లో వచ్చాయి. కానీ ఒక జాబునుచూచి స్తంభించిపోయాను నేను. ఆ జాబు ఇలా వుంది.

"ఆర్యా!

తమరు గత సోమవారం 'రామూ' అనే వ్యక్తిపేర ప్రచురించిన 'శిల్ప సుందరి' చిత్రం ప్రఖ్యాత యూరప్ చిత్రకారుడు డాక్టర్ జంకిన్స్ గీచిన 'పిరమిడ్స్' అనే బొమ్మకు మక్కీకి మక్కీ కాపీ. ఇలాంటి తర్జుమా చిత్రాలు ప్రచురించడం ద్వారా మీ పత్రిక స్థాయిని కోల్పోతున్నందుకు చింతిస్తున్నాను. ఇట్లు పచ్చిపులుసు గుండేరావు, రంగాయార్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-17".

ఈ ఉత్తరం చూడగానే నాలో కలిగిన భావాలు వెంటనే వర్ణించడం అసాధ్యం! కొంత సేపైన తర్వాత గుండేరావుమీద నాకు బాగా కోపం వచ్చింది. మన తెలుగువాళ్ళ తెలివి ఎలా వికసిస్తున్నదో తెలుసుకునేందు కీ ఉత్తరం ఒక ఉదాహరణ మనిపించింది. బెంగాలు ప్రాంతములో ఒక వివేకనందుడు జన్మించినందుకు వేదాంతులూ, రవీంద్రుడు జన్మించినందుకు కవులూ కళాకారులూ, నేతాజీ జన్మించినందుకు దేశభక్తులూ అంతర్జాతీయంగా తమ ఘనతను చాటుకుంటున్నారు. కాని తెలుగుదేశంలోనో? ఖర్మకాలి ఒక కళాకారుడి కెక్కడైనా సన్మాన సభ జరిగితే చాలు ఇంక వదలకుండా ఈ విమర్శక వ్యాఘ్రాలూ ఆయనకు సంతాప సభ జరిగేవరకూ నిద్రపోరు. ఎక్కడ ఒక వ్యక్తి పైకిపోతా

డోన్న భయంతో నిరంతరం కాళ్ళకు తాళ్ళుకట్టి గుంజుతూనేవుంటారు. ఇంక ఈ దేశానికి విముక్తి ఏమిటి? - అనుకున్నాను. ఈ బాధతో నేను మధనపడుతూ వుండగా లలితకళా ఎకాడమీ రామేశ్వరరావుగారు ఫోనుచేసి "దీక్షితులుగారూ ! మీకో శుభవార్త. మీరు మాకిచ్చిన రాము గీచిన 'శిల్పసుందరి' చిత్రం నిన్నటి ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి గెలుచుకుంది" అని చెప్పారు. ఈ వార్త నన్ను కొంత ఊరట చెందించింది తాత్కాలికంగా. కానీ ఓ వారం లోపల ఆ పత్రిక సంపాదకులు ఇలా ఓ లేఖ ప్రచురించారు.

"ఇటీవల మేము ప్రచురించిన చిత్రం 'శిల్పసుందరి'కి ఎకాడమీలో కూడా ప్రథమ బహుమతి వచ్చినట్లు మాకు వార్త అందింది. అయితే ఇది డాక్టర్ జంకిన్స్ గీచిన 'పిరమిడ్స్' అన్న చిత్రానికి తర్జుమా అన్న విషయం ఒక పాఠకుడు మా దృష్టికి తెచ్చారు. ఇందలి నిజానిజాలు పరీక్షించిన అనంతరం 'శిల్పసుందరి' రాము గీచిన ఒరిజినల్ కాదనీ కాపీయేననీ మేము నిశ్చయించాము. కాపీ బొమ్మలు గీయడమూ కథలు వ్రాయడమూ ఎంత హీనమో మా తెలుగు పాఠకులకు వేరే మేము చెప్పనక్కరలేదు. ఈ శిల్పసుందరి చిత్రాన్ని రామూ పేర ప్రచురించినందుకు మేము చింతిస్తున్నాము- ఇట్లు సంపాదకుడు."

ఈ లేఖ చదివేసరికి నా తల తిరిగిపోయినట్లనిపించింది. భూమ్యాకాశాలు కదిలిపోతున్నట్లనిపించాయి. ఆవేశంతో ఓ టాక్సీలో స్థానిక అమెరికన్ కల్చరల్ సెంటర్‌కు వెళ్ళాను. అక్కడి అధికారి నాకు మిత్రుడే, నన్ను ప్రేమతో ఆహ్వానించాడు. యోగక్షేమాలు అడిగిన తర్వాత వచ్చిన పనేమిటని ప్రశ్నించాడు. యూరోపియన్ చిత్రకారుడు డాక్టర్ జంకిన్స్ గీచిన బొమ్మల ఫోటోల ఆల్బమ్ మీదగ్గర వుందా? అని ప్రశ్నించాను. "ఆ - వుంది - సవ్యాఖ్యానంతో ఓ ఆల్బమ్ వుంది చూడండి." అని వెంటనే నాకు అందించారాయన ఆల్బమ్ ఓ రెండు నిమిషాల్లో. అందులో ఒక్కొక్క బొమ్మనే తిప్పుతూ పోయాను.

ఒక బొమ్మ దగ్గరకు వచ్చేసరికి హఠాత్తుగా ఆగిపోయాను. ఆ బొమ్మపైన 'పిరమిడ్స్' అని శీర్షిక వుంది. క్రింద శిథిలమైన కొన్ని పిరమిడ్స్, ఆబాక్ గ్రౌండుమీద ఓ శిల్పసుందరి నర్తిస్తున్నట్లు ఓ చిత్రం వుంది.

నా గుండె స్తంభించిపోయినట్లనిపించింది.

సరిగ్గా అది రామూ గీచిన బొమ్మే !

ఏమీ భేదం కన్పడటంలేదు.

ప్రకృతి కోపగించినందుకు సూచనగా వాడిన అరుణరేఖల దగ్గరినుండి యథాతథంగా అవే రంగులు అవే భావాలు. 'వాట్ హాపెండ్? (ఏం జరిగింది)' కల్చరల్ సెంటర్ అధికారి నా భుజం తడుతున్నా కూడా నాకు స్మృతి సంపూర్ణంగా రాలేదు. అక్కడి జవాను ఓ గ్లాసు మంచినీళ్ళు యిచ్చాడు. అవి తాగిన ఓ అయిదు నిమిషాలకు నేను ఈ లోకానికి వచ్చాను. రంగారావూ, రామూ కలిసి ఏదో దొంగనాటకం ఆడారని నాకు స్ఫురించింది. పల్లెటూరి ప్రకృతిలో ఇంత మోసమా?? అవును - ఆశ్చర్యం ఏముంది?? మొగలిపొదలలో మిణ్ణాగులు లేవా? సన్నని పైరుపొలాల్లో వసిరికలు లేవా?? నా ఊహ కతీతమైన నాటకమిది - బాగా నాగరికత బలిసిన ఏ విదేశాల్లోనో ఇలాంటిది జరిగితే నేను ఆశ్చర్యపోయేవాణ్ణికాదు. కాని భారతదేశంలో, అందులోనూ తెలుగుప్రాంతాన ఓ పల్లెటూళ్ళో ఇలా జరిగిందంటే నాకు నమ్మశక్యం కాలేదు.... జంకిన్స్ జీవితానికి సంబంధించి ఓ పుస్తకం తీసుకొని మాట్లాడకుండా కల్చరల్ సెంటర్ నుంచి ఇంటికి వచ్చేశాను. కొన్నాళ్ళయిన తర్వాత తీరిక చూచుకొని ఆ పుస్తకం చదవడం మొదలు పెట్టాను. జంకిన్స్ జీవితం చాలా విశిష్టంగా వుంది. ప్యారీస్‌లోని వాన్‌గో - పికాసో వంటి ప్రముఖ చిత్రకారుల జీవితాలవలెనే జంకిన్స్ జీవితమూ చాలా ఆసక్తిదాయకంగా వుంది. ఓ నవల వ్రాయడానికి సరిపోయినంత కథా కమామిషూ అందులో వున్నాయి. తీరిక దొరికినప్పుడల్లా ఓ పది పేజీల చొప్పున అలా చదువుతూ వున్నాను.

ఇలా వుండగా ఓనాడు విజయవాడకు నేను జాబు వ్రాశాను, "రామూ అభివృద్ధిని గూర్చి మీ అభిప్రాయమేమిట"ని అక్కడి శిక్షణాధికారి - దానికి సమాధానంగా ఆయనొక సుదీర్ఘమైన జాబు వ్రాశాడు . ఆ వుత్తరం నన్ను కలవరపరిచింది.

"శ్రీయుతులు దీక్షితులు గారికి నమస్కారములు. మీరు వ్రాసిన రామూ ప్రముఖ చిత్రకారుడు కాగలడనడంలో సందేహంలేదు. అతని శిల్ప సుందరి చిత్రం మీద వచ్చిన వివాదం కూడా నేను పత్రికల్లో చూచాను. అయితే కార్లైల్ మహాశయుడు చెప్పినట్టు భావాలనేవి శాశ్వతమైనవి. అందులో నూతనత్వమనేది ఎవ్వడూ సృష్టించలేడు. ఆవే నవరసాలూ, అవే మానవ ప్రకృతులూ, అవే సంఘర్షణలూ. సమన్వయాలూ, విషాదాంతాలూ సుఖాంతాలు - కాకుంటే, వ్యక్తి

వ్యక్తికీ ఉక్తివై చిత్రం మారుతుంది. అంతేకాదు, భావాలకు దేశకాల పరిమితులు లేవు. అనాది నుంచి అనంతం వరకూ అవి ఈ విశ్వంలో నిరంతరం సంచరిస్తూనే వుంటాయి. కాబట్టే కాళిదాసు భావాలు అనేకం మనకు కొన్ని వందల సంవత్సరాల తర్వాత వేరే దేశంలో పుట్టినా అంతే మహిమాన్వితుడైన కవి షేక్స్పియరులో అనేకం కన్పడుతాయి. అందుకే రాముా చిత్రాన్ని కాపీ అని నేను అనలేక పోతున్నాను. నా ఎదురుగానే అతను గీచిన ఒకటి రెండు చిత్రాలు నా దగ్గరున్నాయి. అలాంటివి ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లోని ఏ కళాకారుడూ ఇంతవరకూ గీయలేదని నేను చెప్పగలను. ఇంత చిన్న వయసుతో రాముా చూపించిన ఈ ప్రజ్ఞను నేనే నమ్మలేకపోతూ వున్నాను.

అయితే ఓ విచారవార్త. రాముా స్కాలర్‌షిప్ విరమించుకొని తిరిగి అమరావతి వెళ్ళిపోయాడు. ఆదేమని గట్టిగా నేను దభాయించాను. సామదానాదులను ప్రయోగించాను. చివరకు బెదిరించే సరికి భోరున ఏడుస్తూ, "అమ్మా నాన్నా కొడుతున్నా సరే, ఆ అమరావతిలోనే, ఆ శిల్పాల మధ్య ఇసుక తిన్నెల మధ్య కూర్చుంటేనే నాకు బొమ్మలు గీయ బుద్ధిపుడుతున్నది. కృత్రిమమైన ఈ విజయనాడ నాగరికతలో నాలుగు గోడల మధ్య నేను బొమ్మలు గీయలేను. మరి బొమ్మలు గీయకుండా బతకనూలేను - కాబట్టి నన్ను వదిలిపెట్టండి వెళ్ళిపోతాను" అని నీళ్ళనుండి గట్టున పడేసిన చేపపిల్లలాగా గిలగిల కొట్టుకున్నాడు. అందుకని అతన్ని రిలీవ్ చేసి పంపించేశాము. అతనింక మా శిక్షణా కేంద్రం విద్యార్థి కాడు. అంత చక్కని వ్యక్తి నుండి మంచి బొమ్మలు వచ్చేటట్లుగా ప్రోత్సాహాన్నిచ్చి, కువిమర్శకుల ఆట కట్టించి కళాసేవ చేయవలసిన బాధ్యత ఇక మీరే తీసుకోవాలి. ఇట్లు కార్యదర్శి, విజయవాడ." ఈ లేఖ చదివి నేనూ చాలా బాధపడ్డాను. నిజమే ! రాముా ఆ నిరంతర రామణీయకమైన ప్రకృతిలో తానూ ఒక ప్రకృతి. తానూ ఒక భాగం. అందుకనే ఆ కృష్ణాతీరం విడిచి అతడు జీవించలేడు. నదిలో ప్రతిరోజూ అలా సూర్యోదయమూ సూర్యాస్తమయమూ ప్రభాతమందలి ఉషస్సుషమా సాయంకాలపు రాగరేఖలూ చూడకుండా అతడు జీవించలేడు. ప్రకృతిమాత ఒడిలో నుండి అతన్ని బస్తీకి లాగి నేనే తప్పు చేశానేమో అనిపించింది - ఇలా అనుకుంటూ ఆ రోజు రాత్రి తిరిగి జంకిన్స్, జీవితం చదువుతున్నాను... గ్రంథం ముగింపుకు వచ్చింది. పాశ్చాత్య చిత్రాల్లో భౌతికమైన రక్తమాంసాల సౌందర్యం ఎక్కువగా ప్రదర్శింపబడు

తుంది. జంకిన్స్ ఈ పద్ధతిలో బొమ్మలు గీచి గీచి, మదిరామదవతుల వ్యామోహంలో మునిగి తేలి చివరకు భ్రాంతి వదిలి మరణానికి ముందు కనీసం వచ్చే జన్మలోనన్నా ఆత్మ సౌందర్యానికి ప్రాధాన్యమిచ్చే బొమ్మలు గీయాలనీ అందుకై ఏ అజంతా అమరావతీ శిల్ప కళనో ఉపాసించేందుకు వీలుగా తన జన్మను భారతదేశంలో ప్రసాదించమనీ విలపించి విలపించి అసంపూర్ణమైన కోరికలతో తీరని ఆవేశాలతో ఒక విచిత్ర పరిస్థితిలో పారిస్‌లో జీవితం ముగించినట్లుగా వుంది. ఇది చదివి నేను తిరిగి తీవ్రమైన ఆలోచనలో పడ్డాను. భూమ్యాకాశాలు కలసిన చోటునుంచీ దూసుకొనిపోయే దేశకాలాల నతిక్రమించిన ఏవో సత్యాలు నాలో ప్రణవ ఘంటికలను మ్రోగించాయి. జంకిన్స్ వర్ణనా ఫోటోలు అతని శరీరంపై పుట్టుమచ్చల గుర్తులూ, వేసుకునే దుస్తుల వివరాలూ, అన్నీ ఆ పుస్తకపు అనుబంధంలో చేర్చబడ్డాయి. అవి చదివి ఆవేశంతో కలమూ కాగితమూ తీసుకొని రామూకు ఉత్తరం వ్రాస్తూ "నా ఆలోచన ఉపపత్తి హేతువాదానికి నిలువకపోవచ్చు అయినా ఒక విషయం నేను నిర్ధారణ చేసుకోదలచాను. ఈ రెండు వాక్యాలు కూడా నీకు అర్థంకాక అయోమయంగా వుండవచ్చు - అయినా ఫరవాలేదు. నాకు ఈ ఒక్క విషయం స్పష్టంగా వ్రాయి. నీకు కుడి భుజం పైన ఓ పుట్టుమచ్చ వుందా ? బహుశా ఉండకపోవచ్చు. లేదని వ్రాస్తేనే ప్రపంచమూ నేనూ సంతోషిస్తాము. అదే సమంజసం కూడా. ఉందని వ్రాస్తేమటుకు ఇది ప్రపంచంలోని ఏడు వింతలతోబాటు పునర్జన్మకు సంబంధించిన ఎనిమిదవ వింత అవుతుంది. ఏ విషయమూ దీనితో జతపరిచి స్టాంపులంటించిన కవరులో నాకు వెంటనే వ్రాయి." ఉత్తరం పోస్టు చేశాను.

ఓ ఆరురోజుల లోపల దానికి జవాబు వచ్చింది.

"........... ఔనండీ - నా కక్కడ పుట్టుమచ్చ వుంది."